క్లుప్తంగా

నేటి నుంచి ధార్మిక కార్యక్రమాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బెలుంలోని శ్రీకృష్ణ మందిరంలో మంగళవారం నుంచి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకట శివారెడ్డి తెలిపారు. ధార్మిక కార్యక్రమాల కరపత్రాలను సోమవారం ఆయన విడుదల చేశారు. నాలుగు రోజుల పాటు సాయంత్రం ధార్మిక ప్రవచనాలతో పాటు భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొలక హుసేనయ్య, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం గడపాలి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో వివాదాలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు, సస్పెక్టర్ల కదలికలపై నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు అందరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయాలకు చెందిన మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. విధి నిర్వహణలో చేయాల్సిన పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల సీఐ నారాయణ రెడ్డి, ఎస్ఐ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మినరసయ్య, ఉపాధ్యాయులు సుధాకర్‌గౌడ్, మూర్తి, కొండారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని పాత బుగ్గ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు నిర్వహించారు. భక్తులతో పాటు ఆలయ ధర్మకర్తలు బైసాని రాజు దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

హోసన్నా వృద్ధాశ్రమంలో

పట్టణంలోని కొండపేటకు చెందిన తిరుపతి కుమారుడు భానుప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే నిత్యావసర సరుకులు అందించారు.

అన్నదానం



శివ మాలధారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: స్థానిక నంద్యాల రహదారిలోని దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో గురుస్వామి మాదినేని నారాయణ స్వామి సహకారంతో శివ మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వచ్చే నెల 18వ వరకు అన్నదానం కొనసాగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు గౌరి హుసేన్‌రెడ్డి, పోలూరు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఆ నలుగురి' మానవత్వం



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని మిస్పా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నెల్లూరు జిల్లా సింగసాని లక్ష్మీనారాయణ (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియలు నిర్వహించాలని మిస్పా వృద్ధాశ్రమ నిర్వాహకుడు జక్కరయ్య కోరగా ఆ నల్గురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషా ఆధ్వర్యంలో సభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి, రాఘవేంద్ర, అక్బర్, మాబాషా, యూసుఫ్, సద్దాం, పుల్లం రాజు పాల్గొన్నారు.

జనరంజక పాలన



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి



కేక్ కట్ చేస్తున్న నాయకులు

డోన్ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జనరంజక పాలన సాగుతోందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. జగనన్న ప్రజా సంకల్ప పాద యాత్ర పూర్తై నాలుగేళ్లైన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్వగృహంలో ఎంపీపీ రాజశేఖరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడుతో కలిసి మున్సిపల్ చైర్మన్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 నవంబరు 6న ఇడుపులపాయలో పాదయాత్రను ప్రారంభించి 2019 జనవరి 9న ఇచ్ఛాపురం వద్ద ముగించారన్నారు. ఉమ్మడి 13 జిల్లాల్లోని 134 నియోజకవర్గాల్లో 2,516 గ్రామాల్లో 341 రోజులు 3,648 కిలో మీటర్లు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ఇప్పటి వరకు 98శాతం పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తూ జనరంజకమైన పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. జగనన్న ప్రజా సంకల్పయాత్ర పూర్తై నాలుగేళ్లు అయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని కొత్త బస్టాండులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బళ్లాని సూర్య, ఈశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



బేతంచెర్లలో ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

అవుకులో..

అవుకు: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర పూర్తై నాలుగేళ్లయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు సీఎస్ఐ చర్చి నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు కార్యకర్తలు, కాలనీవాసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు, మహిళలకు పంచిపెట్టారు. ఆస్పత్రికి వెళ్లి అక్కడి గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మందా గుర్రమ్మ, పార్టీ నాయకుడు చల్లా విక్రాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తై నాలుగేళ్లయిన సందర్భంగా సోమవారం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

నవరత్నాలతోనే పేదల జీవితాల్లో వెలుగులు

బేతంచెర్ల: నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలీ, మండల నాయకుడు బుగ్గన చంద్రారెడ్డి బాబుల్ రెడ్డిలతో కలిసి కొలుములపల్లె గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. మూడేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు లేవనెత్తగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ చిన్న మద్దమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మరియమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైస్ ఎంపీపీ రంగస్వామి పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

షేక్ ఫాతిమా ఆశయ సాధనకు కృషి

ప్యాపిలి: సాంఘిక దురాచారాలను జ్యోతిరావు పూలే దంపతులతో కలిసి పోరాడిన షేక్ ఫాతిమా ఆశయ సాధనకు కృషి చేద్దామని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు మత్తుబాబా సాహెబ్, శ్యాంసన్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా సోమవారం షేక్ ఫాతిమా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదరసా విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంఘం నాయకులు మాట్లాడారు.



ఫాతిమా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గొడవలకు దూరంగా ఉండండి

కొలిమిగుండ్ల: గొడవలకు దూరంగా ఉండి పిల్లలను చదివించుకోవాలని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్ రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సర్పంచ్‌లు, ఎంటీటీసీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గొడవల కంటే కుటుంబాలు, ముఖ్యమనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. వివాదాల్లో తలదూర్చి జైల్ పాలు కావద్దన్నారు. కుటుంబాలతో ఉండి ప్రశాంత జీవనం గడపాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎస్ఐ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్యాపిలి: స్థానిక పీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా వైద్యాధికారులు వాణిశ్రీ, నితీష్ కుమార్ గర్భిణులను పరీక్షించారు. 8 మందిని హైరిస్క్ ప్రెగ్నెన్సీగా గుర్తించి డోన్ ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. ఆకుకూరలు, గుడ్లు, పాలు, తృణధాన్యాలు, సీజనల్ పండ్లు తీసుకోవాలని వైద్యులు గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.



గర్భిణులకు సలహాలిస్తున్న వైద్యాధికారిణి వాణిశ్రీ

డీఈఓకు ఫిర్యాదు

డోన్ టౌన్: నిబంధనలు ఉల్లంఘిస్తున్న అధిక ఫీజు వసూలు చేస్తున్న నారాయణ, షిర్డీ సాయి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం నంద్యాలలో డీఈఓ అనురాధను కలిసి వినతిపత్రం ఇచ్చారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు తెలుగు విజయ్‌కుమార్, నిరంజన్, కిరణ్, సుమంత్, మహేష్, గోపాల్, కళ్యాణ్ ఉన్నారు.

వేగంగా గృహ నిర్మాణాలు

బనగానపల్లె: జగనన్న కాలనీలలో గృహనిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 1,768 మందికి గృహాలు మంజూరుకాగా 462 మంది పూర్తి చేసుకున్నారన్నారు. మిగిలిన లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారని, వేగంగా పూర్తి చేసుకునేందుకు కావాల్సిన సిమెంట్, ఇసుక, ఐరన్ అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ గిడ్డంగిలో అక్రమంగా నిల్వ ఉంచిన 75 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ శంకర్‌నాయక్ సోమవారం తెలిపారు. కర్నూలు విజిలెన్స్ అధికారుల సమాచారం మేరకు అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వైఎస్సార్ బీమా సొమ్ము పంపిణీ

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన మంగలి సురేష్ కొద్ది నెలల క్రితం మృతిచెందాడు. అతడి కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్ష సోమవారం మృతుని భార్య మండలి సరోజమ్మకు కౌన్సిలర్ దారా హరినాథ్‌రెడ్డి అందజేశారు.

అ'పూర్వ' సమ్మేళనం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో పాణ్యం సిమెంట్ ఉన్నత పాఠశాల 2003- 04 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. 19 ఏళ్ల తర్వాత స్నేహితులందరూ ఒకే చోట చేసి అప్పటి తీపిజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ హెచ్ఆర్‌జీఎం రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కోవెలకుంట్ల: గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని మండలంలోని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. సోమవారం పీఎంఎస్ఎంఏ పథకం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు, తదితర పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రతినెలా డాక్టర్లను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు.



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

శబరిమలకు అయ్యప్ప భక్తులు

ప్యాపిలి: పట్టణానికి చెందిన అయ్యప్పస్వామి మాలధారులు సోమవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు నాయుడు, కిరణ్, ప్రసాద్, ఎల్లప్ప, రాజు తదితరుల ఆధ్వర్యంలో 64 మంది వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. అంతకు ముందు స్థానిక అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరిమలకు తరలి వెళ్తున్న మాలధారులకు వీడ్కోలు పలికేందుకు బంధుమిత్రులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



శబరిమలకు బయలుదేరుతున్న అయ్యప్ప మాలధారులు

డైరీ ఆవిష్కరణ

డోన్ టౌన్: ఆర్టీసీ ఎన్ఎంయూఏ డైరీ-2023 ను సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణంలో మేనేజర్ శశిభూషణ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు, సీసీఎస్ డెలిగేట్ సుదర్శనరావు ,డిపో చైర్మన్ రామకృష్ణ, అధ్యక్షలు సీతారామిరెడ్డి, ఉపాధ్యక్షుడు రమణ, గ్యారేజ్ ఇన్‌చార్జ్ గోపాలు, హెడ్‌కానిస్టేబుల్ మద్దయ్య తదితరులు ఉన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సర్వేయర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని డైరెక్టర్లు ప్రతాప్, సంతోష్‌కుమార్ సోమ వారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 7396318379, 76618286411, 8297234 474 నంబర్లను సంప్రదించాలని డోన్ కేంద్రం ఇన్‌చార్జ్ తిమోతి తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న కేంద్రంలో శిక్షణ ఉంటుందన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందిస్తామన్నారు.

స్వామి వివేకానంద జీవిత చరిత్రపై పోటీలు

డోన్ టౌన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్రపై ఈనెల 11న తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు తెలిపారు. సోమవారం నాగరాజు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మంగళవారం సాయంత్రం లోపు 8520852058 ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ఈనెల 12న స్థానిక షాదిఖానాలో నిర్వహించనున్న వివేకానంద జయంతి ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

14 నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

డోన్ రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో ఈ నెల 14వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఆరు పళ్ల ఎడ్లకు, 16న న్యూక్యాటగిరీ సైజు ఎడ్ల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. విజేతలైన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు సుధాకర్‌రెడ్డి 9959242619, రమణారెడ్డి 8106274616, చంద్రశేఖర్‌రెడ్డి 9398228561 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో రూ.1.85 కోట్లతో చేపట్టిన పది పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర(పీహెచ్‌సీ) భవనం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయి. త్వరలోనే పూర్తయితే మెరుగైన వైద్యసేవలు అందుతాయని పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల ప్రజలు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు.

వరి సాగుపై రైతుల ఆసక్తి

బనగానపల్లె: వరి సాగుపై రైతులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. నియోజకవర్గంలో ఎస్సార్‌బీసీ, వ్యవసాయ బోర్ల ఆధారంగా వరిని సాగు చేస్తారు. ఖరీఫ్‌లో వరి పంట దిగుబడులు ఆశా జనకంగా రావడంతో పాటు గిట్టుబాటు ధర లభించడంతో ఈ సారి వరిని సాగు చేసేందుకు రైతులు ఎక్కువ ఇష్టం చూపుతున్నారు. అందులో భాగంగా వరినారు మడులు పోసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. రబీలో షుగర్‌లెస్, 1010,555 రకాల సాగుకు రైతులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ రకం పంటలు తెగుళ్లను తట్టుకొని నిలబడుతాయని రైతులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ఎస్సార్‌బీసీ ఆధారంగా 68 వేలు, వ్యసాయబోర్ల ఆధారంగా 24 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఖరీఫ్‌లో వ్యవసాయాధికారుల రికార్డుల ప్రకారం 24,620 ఎకరాల్లో రైతులు నంద్యాల, కర్నూలు సోనా రకం వరి పంటనుసాగు చేశారు. రెండేళ్లుగా కేవలం 20 బస్తాలకు మించి దిగుబడి రాకపోగా ఈఏడాది ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో 35-40 బస్తాల దిగుబడి లభించింది. గత ఏడాది కన్న బస్తాకు రూ.300 వరకు అదనంగా ధర పలికింది. పెట్టుబడి పోనూ రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఆదాయం చేకూరింది. కౌలు రైతులకు కూడా ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వచ్చింది. దీంతో అన్నదాత ఎక్కువ వరిని సాగు చేశారు. దీనికి తోడు గోరుకల్లు రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న ఎస్సార్‌బీసీ ద్వారా ఏప్రిల్ చివరి వరకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించడంతో పంట పండినట్లేనని అన్నదాత పేర్కొంటున్నారు.



రైతులు సాగు చేసిన వరినారు మళ్లు

డ్రిప్ ఇరిగేషన్‌తో అధిక ప్రయోజనం

వెల్దుర్తి: డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం)తో రైతులకు నీటి ఆదాతో పాటు అధిక మేలు జరుగుతుందని ఏపీఎంఐపీ (డ్రిప్ ఇరిగేషన్) స్టేట్ పీఓ హరినాథ్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం నంద్యాల, కర్నూలు జిల్లాల్లో రైతులకు సబ్సిడీపై అందించిన పరికరాలు, డ్రిప్ విధానంలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఓర్వకల్లు మండలం కాలువ గ్రామ రైతు వెంకటేశ్వర్లు మూడెకరాలలో సాగు చేసిన అరటి పంట, వెల్దుర్తి మండలం రామళ్లకోటలో రైతు బాలు ఎకరా పొలంలో సాగు చేసిన కరివేపాకు పంట, కృష్ణగిరి మండలం తొగర్చేడు రైతు వెంకటేశ్వరరెడ్డి ఐదెకరాలలో సాగు చేసిన మామిడి మొక్కలను పరిశీలించారు. రామళ్లకోట రైతు బాలు ఎకరా పొలంలో రూ.45 వేల డ్రిప్ పరికరాలు 10 శాతం ధరకు పొంది (90 శాతం సబ్సిడీ) ఒక ఇంచు నీటితో కరివేపాకు సాగుచేసి అధిక లాభాలు అర్జించినట్లు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. పీఓ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని, మొక్కలకు అందించాల్సిన ఎరువులు, మందులు పక్కాగా అవసరమైన వరకు అందించవచ్చని తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు. ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎంఐపీ జిల్లా పీడీ ఉమామహేశ్వరమ్మ, ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, కర్నూలు సెక్టార్ హార్టికల్చర్ ఆఫీసర్ విజయలక్ష్మి, రైతులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ నాయకుడు, దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి జ్ఞాపకార్థం మండల నాయకులు అండ్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ మండల కేంద్రంలో ప్రారంభం కానుంది. విజేతలకు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి రూ.10,016, రూ.5,016 నగదు బహుమతులు అందించనున్నారు. పాల్గొనదలచిన జట్లు ఎంట్రీ ఫీజు రూ.400లతో 97012 84961, 93464 49004 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కేఆర్ఎంబీ కర్నూలులో ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలని, కృష్ణా నదికి ఏ మాత్రం సంబంధం లేని విశాఖపట్నంలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పునఃసమీక్షించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి కోరారు. కృష్ణానది యాజమాన్య బోర్డు ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై సోమవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో తాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 17న నంద్యాల కేంద్రంగా సత్యాగ్రహం చేపట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు సహదేవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామన్న, వెంకటరమణయ్య, కృష్ణారెడ్డి, శంకరయ్య, చింతలకుమార్, పులికొండన్న, నసరుల్లాఖాన్, భాస్కరరెడ్డి, బాలీశ్వరరెడ్డి, ప్రసాదరెడ్డి, సంజీవ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్ రెడ్డి

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(సిటీ): జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో ఆమె మాట్లాడుతూ డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్న జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, పీజీ, బీ టెక్ తదిత ర విద్యార్హతలు కలిగిన వారికి 13 జాతీయ సంస్థల ప్రతినిధులు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావా లని సూచించారు. వివరాలకు సెల్ 9533631002, 6303397635నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.